ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 2 మే 2025




ఉష్ణోగ్రత (అంచనా) 2-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	28


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, రవీంద్ర, నాదెండ్ల మనోహర్


వెలగపూడి సభా ప్రాంగణం వద్ద పసుపు జెండాలతో స్వాగతం


టీడీపీ జెండాలతో అలంకరించిన ప్రకాశం బ్యారేజి


సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



నవశకానికి.. నేడే నాంది

ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని అమరావతి పునర్వికాసం దిశగా పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణతో రాష్ట్ర చరిత్రలో నవశకానికి శుక్రవారం బీజం పడనుంది. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు సకల ఏర్పాట్లు జరిగాయి. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో శంకుస్థాపన, బహిరంగసభకు భారీగా ఏర్పాట్లు జరగ్గా.. రాజధాని జిల్లా గుంటూరుతో పాటు సమీప బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటం, ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు. పోదం పద మోదీ సభకి.. జై కొడదాం అమరావతికి అంటూ జనం సిద్ధమవగా.. వారి రవాణా, భోజనం, తాగునీటి తదితర వసతులకు అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. ఇక రాజధాని గ్రామాల్లో అమరావతి నిర్మాణ శంకుస్థాపనను ఓ మహోత్సవంలా రాజధాని రైతులు, మహిళలు భావిస్తున్నారు.


ప్రధాని మోదీ ఆవిష్కరించే పైలాన్


ప్రధాని పర్యటన సాగేదిలా...

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కేరళ నుంచి మధ్యాహ్నం 2.45కి గన్నవరం విమానాశ్ర యానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి ఎంఐ-17 హెలికాప్టర్‌లో బయల్దేరతారు. మధ్యాహ్నం 3.10కి వెలగపూడి సచివా లయానికి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారు. 3.20కి సభా ప్రాంగణానికి చేరుకుని 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 3.30 నుంచి 4.45 గంటల మధ్య శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణమై 4.50కి హెలిప్యాడ్‌కు చేరుకుని సాయంత్రం 5.15కి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

- అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి
- ఏ ఆకృతిలో 20 అడుగుల పైలాన్.. ఆవిష్కరించనున్న మోదీ
- వెలగపూడిలో సభకు భారీ ఏర్పాట్లు.. లక్షలాదిగా తరలిరానున్న ప్రజలు
- రాజధానికి కొండంత భరోస ఇవ్వనున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నేనున్నానంటూ కొండంత భరోస కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం అమరావతి పర్యటనకు వస్తున్నారు. రాజధాని చరిత్రలో 2025 మే 2వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అంతా భావిస్తున్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ప్రధానమంత్రి హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భారీగా ఏర్పాట్లు చేసింది. వెలగపూడి రాష్ట్ర సచివాలయం పడమర వైపున భారీగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు గురువారానికే పూర్తి చేశారు. హెలిప్యాడ్ నుంచి వేదిక వరకు ప్రధానమంత్రి కాన్వాయ్ ట్రైల్ రన్(రిహార్సల్) విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని వేదికకు కుడి వైపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి, ఎడమ వైపున పారిశ్రామికవేత్తలు ఆశీనులవడానికి ప్రత్యేకంగా వేదికలను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి 20 అడుగుల పైలాన్‌ని ఆంగ్లంలో ఏ ఆకారంలో సీఆర్‌డీఏ నిర్మించింది. ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ అమరావతికి స్వాగతం పలుకుతున్నట్లుగా పైలాన్‌ని తీర్చిదిద్దింది. రూ.49,040 కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ, న్యాయమూర్తుల నివాస సముదాయాలు వంటివి ఉన్నాయి. అలానే ఎమ్మెల్యేలు, మంత్రులు అఖిల భారత సర్వీసెస్ అధికారుల గృహ సముదాయం పెండింగ్ పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంస్థలు ఏర్పాటు చేయబోయే కార్యాలయాల భవనాలకు కూడా పునాదిరాయి వేస్తారు. వీటితో పాటు రైలుమార్గాలు, హైవేలు, మిసైల్ టెస్టు రేంజ్, వైజాగ్‌లో యూనిటీ మాల్ వంటి పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. గ్యాలరీలన్నీ నిండినా ఇబ్బంది రాకుండా సభావేదికకు బయట వైపున ప్రత్యేకంగా టెంట్లు వేసి అక్కడ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు. కాగా ప్రధాని మోదీ బహిరంగ సభలో చేసే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అమరావతికి ఇప్పటికే కేంద్రం సాయం ప్రకటించి బ్యాంకింగ్ సంస్థల నుంచి నిధులు ఇప్పించింది. భవిష్యత్తులోనూ అమరావతికి

(మిగతా 8వ పేజీలో)


సుందరంగా సభా ప్రాంగణం

పడిలేచిన అమరావతి

ఐదేళ్ల వైసీపీ చీకటిపాలనలో నిత్యం పోరాటాలు, ఉద్యమాలతో అట్టుడికిన అమరావతి నేడు ఒక గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందేందుకు సిద్ధమైంది. మూడు రాజధానుల కుట్రతో కునారిల్లిన ఆంధ్రుల కలల రాజధాని అమరావతి మళ్లీ జీవం పోసుకుంటున్నది. 2014-2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు కీలకమైన పనులను ప్రారంభించింది. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణంతో పాటు ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవసరం అయిన వసతి భవనాలను చాలా వరకు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి పనులను నిలిపేసి.. మూడు రాజధానుల డ్రామా తో ఐదేళ్లు కాలక్షేపం చేసింది. ఈ క్రమంలో అమరావతికి భూములు ఇచ్చి న రైతుల చిరకాల పూజలు ఫలించి రాజధాని రూపకర్తగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు గెలవడంతోనే అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది.

మూడు ముక్కలాటలో ఎందరో బలి

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలుపెట్టిన మూడు ముక్కలాటలో వందల మంది రైతులు అశువులు బాశారు. తీవ్ర ఆవేదనకు గురైన ఆ గుండెలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వారి కుటుంబాలు ఛిద్రమైపోయాయి. రాజధాని కోసం భూమిని అప్పగించిన వారి త్యాగమే వారి పాలిట మృత్యుపాశమైంది. రాజధానిగా అమరావతి ప్రకటన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైసీపీ అధినేత జగన్ సంపూర్ణ ఆమోదం తెలిపారు. దీంతో రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా భూములు ఇచ్చేశారు. ఎన్నికల సమయంలో రాజధాని తరలింపుపై రైతుల్లో అనుమానాలు రేకెత్తగా.. జగన్మోహన్‌రెడ్డి ఇక్కడే తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని, రాజధాని ఎక్కడికీ పోదని అధికార పార్టీ నేతలు నమ్మించారు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి అదే ఏడాది డిసెంబరులో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో రైతులు హతాసులయ్యారు. అమరావతే రాజధాని కావాలంటూ గ్రామ స్థాయిలో మహిళలు, రైతులు చేపట్టిన ఉద్యమం గత ఐదేళ్ల మహోద్యమంగా సాగింది. రాజధాని పరిధిలోని 33 గ్రామాలకు చెందిన అన్నివర్గాల ప్రజలు చేపట్టిన ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అయినా వెనక్కి తగ్గని వైసీపీ ప్రభుత్వం తీరుతో అనేక మంది రైతులు అశువులు బాశారు. భూములు ఇచ్చి మనోవేదనతో దొండపాడులో 25 మంది, అనంతవరంలో 12 మంది, మల్కాపురంలో 23 మంది, తుళ్లూరులో 20 మంది, మందడంలో 19 మంది, వెలగపూడిలో 17 మంది, బేతపూడిలో ఆరుగురు, ఐనవోలులో 14 మంది, నీరుకొండలో 13 మంది, నేలపాడులో 12మంది రాయపూడి, ఎర్రబాలెంలో 10 మంది, కృష్ణాయపాలెంలో ఏడుగురు, కురగల్లు, వెంకటపాలెంలో ఐదుగురు చొప్పున, లింగాయపాలెంలో నలుగురు, నవులూరు, నిడమర్రు, నెక్కల్లు ముగ్గురు పెద్దపరిమిలో నలుగురు చొప్పున, తాళ్లాయపాలెం, అబ్బరాజుపాలెం, బోరుపాలెంలో ఇద్దరు చొప్పున రైతులు, రైతుకూ లీలు, కౌలుదారులు మరణించారు. ఇవే కాకుండా ఇంకా గుర్తింపులోకి రాని మరణాలు మరో 50 వరకూ ఉంటాయని రైతులు చెబుతున్నారు. మూడు రాజధానుల ప్రకటన రాజధాని రైతులనే కాదు, ఆ ప్రాంతంలోని రైతు కూలీలను, ఇతర వృత్తులవారిని కూడా ఆవేదనకు గురిచేసింది. ఒకవైపు రైతుల ప్రాణాలు పోతున్నా రైతుల గుండె ధైర్యం జారిపోలేదు. పట్టుదలగా 1631 రోజులపాటు పోరాటాన్ని కొనసాగించి, ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఊరూరు తిరిగి ప్రచారం చేసి కోరుకున్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నారు.



విధ్వంసం నుంచి పునర్వికాసం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా గుర్తించకుండా అభివృద్ధి విఘాతానికి పాల్పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులను సమీకరించుకుని అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకురావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వ హించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.



అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదడంతో పాటు రూపు రేఖలను మార్చేసేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దేశించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు

(మిగతా 8వ పేజీలో)

ప్రధాని సభకు భారీగా..

- ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి
- బస్సులలో 50శాతం ప్రజాప్రతినిధులకు కేటాయించాలి
- జిల్లాకు 350 బస్సులు
- కలెక్టర్ జే వెంకటమురళి

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి జిల్లా నుంచి తరలి వెళుతున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అమరావతి వెళ్ళే ప్రజల కోసం జిల్లా వ్యాప్తంగా 350 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలానికి అధిక సంఖ్యలో బస్సులు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన బస్సులలో 50 శాతం ప్రజాప్రతినిధులకు కేటాయించాలని ఎంపీడీవోలకు సూచించారు. ప్రతి బస్సులో ఒక మహిళా పోలీసు, ఆశావర్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహాయకులుగా ఉంటారన్నారు. ప్రజలు తిరిగి వారి గ్రామాలకు చేరుకునే వరకు పూర్తి బాధ్యత వారిదేనని కలెక్టర్ తెలిపారు. బస్సులోని ప్రయాణికులకు ఒక్కొక్కరికి 4 ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను సరఫరా చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజల కొరకు ఏర్పాటు చేసిన బస్సులు గురువారం రాత్రి 7 గంటలు నుంచి 9గంటలలోపు కేటాయించిన ప్రాంతాలకు చేరుకునేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బస్సులో వచ్చిన డ్రైవర్, సహాయకులకు రాత్రిభోజన, బస ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రెండో తేదీ ఉదయం అల్పాహారాలు ముగించుకొని 9గంటలలోపు బస్సులు బయలుదేరాలని వాటికి సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.


క్షేత్రస్థాయిలో పర్యటించి స్టాల్స్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జే వెంకటమురళి

మండలాలవారీగా నాలుగుస్టాల్స్ ఏర్పాటు

బాపట్ల జిల్లా నుంచి తరలి వెళ్ళే ప్రజలకు మధ్యాహ్నం, రాత్రికి భోజన సౌకర్యాలు, తాగునీటి సౌకర్యాలు మండలాలవారీగా నాలుగుప్రాంతాలలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు.మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు మండలాలు నుంచి వచ్చే ప్రజలకు మార్టూరు దాటిన తర్వాత తాడిపూడి గ్రామం వద్ద స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్చూరు, చిన గంజాం, కారంచేడు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు మండలాలు నుంచి వచ్చే ప్రజలకు ప్రత్తిపాడులో పెట్రోల్ బంకు దగ్గర, బాపట్ల,కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి మండలాల నుంచి వచ్చే ప్రజలకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో, రేపల్లె, వేమూరు, నిజాంపట్నం, అమర్తలూరు, భట్టిప్రోలు, చుండూరు, పిట్టలవానిపాలెం మండలాలకు చెందిన ప్రజలకు నందివెలుగు సర్కిల్ దగ్గర భోజన స్టాల్స్ ఏర్పాటు చేయటమైనదని కలెక్టర్ తెలిపారు. బస్సులో ప్రయాణించే వారు అనారోగ్యానికి గురైతే సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు ఆరోగ్య కేంద్రాల సమాచారం తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు రూట్‌లోని భోజనస్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 25 మండలాలకు కోఆర్డినేటర్లను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి కోఆర్డినేటర్లు ఆయా మండలాధికారులను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. బస్సు బయలు దేరిన దగ్గర నుంచి తిరిగి గ్రామానికి చేరుకునే వరకు కోఆర్డినేటర్లు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈబీ విలియమ్స్, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పాల్గొన్నారు.

వేలు పట్టుకుంటేనే వ్యాధి నయమంట?

తమిళనాడు బృందంపై శింగరకొండ దేవస్థాన అధికారుల ఫిర్యాదు

అద్దంకి, మే 1 (ఆంధ్రజ్యోతి): మందుల అవసరం లేకుండా చేతి వేళ్లు పట్టుకుంటే వ్యాధులు నయం అవుతాయని నమ్మిస్తూ.. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తమిళనాడుకు చెందిన ఓ బృందం డబ్బులు వసూలు చేస్తోంది. ప్రతి గురువారం శింగరకొండ ఆంజనేయస్వామి దేవాలయానికి సమీపంలో ఓ సామాజికవర్గానికి చెందిన అన్నదాన సత్రాన్ని వేదికగా తమిళనాడు బృందం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తుంది. ఏ వ్యాధి ఉన్నా చేయి పట్టుకుని పరీక్షించి ఒక వేలును తాకితే వ్యాధి నయమైపోతుందని ఒక్కో వ్యక్తి నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు. గురువారం ఆలయానికి భక్తుల సంఖ్య తక్కువగా ఉంటున్నా అన్నదానం కోసం పెద్దసంఖ్యలో రావడంతో దేవస్థాన ఈవో తిమ్మానాయుడు ఆరా తీశారు. దీంతో తమిళనాడు బృందం కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. ఆ బృందం ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.


వైద్యం కోసం బారులు తీరి ఉన్న ప్రజలు

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

●షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల బకాయి జీతాలు పంపిణీ


ఉద్యోగికి నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఆయన 12 మంది ఉద్యోగులకు సంబంధించి బకాయి జీతాలు, ప్రావిడెంట్ ఫండ్ రూ.37.72 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూత పడిన షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో నిరుద్యోగ యువతకు, రైతు కూలీలకు ఉపయోగపడే విధంగా మరో కర్మాగారాన్ని ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సంప్రదించి, తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. 2014లో ఉద్యోగుల వీఆర్ఎస్‌కు ఆమోదం తెలపడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.200 కోట్లు నిధులను సమకూర్చడం జరిగిందని కానీ, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పంపిణీకి ఆటంకం ఏర్పడిందని గుర్తుచేశారు. రూ.11 కోట్ల జీతాల బకాయిలు ఉండగా ఫేజ్-1 ద్వారా 12 మంది ఉద్యోగులకు మే డే సందర్భంగా జీతం, ప్రావిడెండ్ ఫండ్ పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరలో అందించేందుకు కృషి చేస్తానన్నారు. లిక్విడేటర్ చంద్రకుమార్, ఉద్యోగుల సంఘం నాయకులు బసివిరెడ్డి, వట్టిప్రోలు యోబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం మృతి


రాజమణి(ఫైల్ ఫొటో)

ఫిరంగిపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట - గుంటూరు రహదారిలో బుధవారం రాత్రి నరసరావుపేట నుంచి గుంటూరుకు బైక్‌పై వస్తున్న గాడిదపాటి రాజమణి, రవికుమార్‌ను నరసరావుపేట నుంచి అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమణి లారీ కింద పడిపోగా వెనుక టైర్లు ఆమె దేహాన్ని ఛిద్రం చేశాయి. మృతురాలు రాజమణి ఏఎన్ఎంగా తాడికొండ మండలం మోతడక గ్రామంలో పని చేస్తున్నారు. రవికుమార్ స్వగ్రామం నరసరావుపేటలోని పాలెంనగర్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహానికి నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు ఫిరంగిపురం ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ గురువారం తెలిపారు.

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య


బసవయ్య(ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, మే, 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుసులూరుకు చెందిన కౌలురైతు తమటం బసవయ్య (44) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బసవయ్య నాలుగేళ్లుగా 20 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిరప, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది మిరప పంట చీడపీడల వల్ల పూర్తిగా నష్టం వచ్చింది. ఈ ఏడాది కూడా మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేయగా దిగుబడి సరిగా రాక, గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడికి చేసిన అప్పులు తీరుతాయలో లేదోనని బసవయ్య ఆందోళన చెందాడు. అప్పు ఇచ్చిన వారు తరచూ ఇళ్ల వద్దకు వస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఉదయం భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. భార్యను పొలం వద్దే వదిలి గుంటూరు వెళ్లి వస్తానని చెప్పిన బసవయ్య పుసులూరు సమీపంలోని ఓ పొలంలో విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు, కుటుంబ సభ్యులు చేరుకొని పరిశీలించగా మృతదేహం పక్కనే కూల్‌డ్రింక్, పురుగుమందు డబ్బా ఉండడాన్ని గుర్తించారు. దీంతో భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ

● వేలాదిగా హాజరై పునఃనిర్మాణంలో భాగస్వాములవుదాం

● రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు

తెనాలిరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకంగా నిలపాల్సిన ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాన్ని గుర్తుపట్టని విధంగా మార్చిందని రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులపై అక్రమ కేసులు పెట్టి, మహిళలపై లాఠీచార్జి చేయించిందని ఆయన మండిపడ్డారు. రాజధాని ఏదంటే చెప్పలేని విధంగా మూడు ముక్కలాట ఆడిందిని, గత పాలనను ఎప్పటికీ ఆంధ్రరాష్ట్ర ప్రజలు మరిచిపోరన్నారు. గురువారం తెనాలిలోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో రాజధాని అమరావతి పునఃనిర్మాణ సభకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీటీ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఇతర కూటమి నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి ముహూర్తం ఖరారైందని, శుక్రవారం సాయంత్రం దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో 175 నియోజకవర్గాల నుండి అశేష జనవాహిని రాజధాని నిర్మాణానికి తరలి రాబోతుందని చెప్పారు. తెనాలి ప్రాంతం నుండి కూడా వేలాదిగా సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి రాజధాని లేకుండా పాలన చేసిన గత ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. బీటీ నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో పరిశ్రమలన్నింటినీ తరిమేశారు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


యూనియన్ల నేతలతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలన్నింటినీ తన్ని తరిమేశారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. మేడే ఉత్సవాలలో భాగంగా పిడుగురాళ్ల షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఐదేళ్లలో అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్.. అరాచకాలు సృష్టించడమే పనిగా పెట్టుకొని పరిశ్రమలను తరిమేసి లక్షల మందికి ఉపాధి లేకుండా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక జగన్ ఇప్పుడున్న పరిస్థితి చూస్తే రాష్ట్రంలో ఎప్పుడు.. ఎక్కడ...ఎవరు చనిపోతారోనని ఎదురు చూస్తూ.. గద్దల్లా వాలిపోతున్నాడన్నారు. మూడుముక్కలాటతో రాజధానిని లేకుండా చేశారని, నేడు మోడీ, చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని పునర్నిర్మాణ శుభారంభం జరుగనున్నదన్నారు. కార్మికులలో అర్హులైన వారికి ఇళ్లస్థలాలు, ఇల్లు మంజూరు చేయిస్తానని, ఆటో నగర్ ఏర్పాటుతో పాటు పార్టీకి కష్టపడి పనిచేసిన పేద కుటుంబానికి ఏడాదికి ఒక ఆటో తానే కొనిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, టీఎన్ టీయూసీ అధ్యక్షుడు యరగాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలతో కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం


కళాకారులకు నగదు పురస్కారం, మెమెంటో ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

● పల్లెకోనలో నాటకాలను తిలకించిన ఎమ్మెల్యే ఆనందబాబు

● ముగిసిన పరుచూరి రఘుబాబు నాటకోత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 1 (ఆంధ్రజ్యోతి): కనుమరుగు అవుతున్న నాటక రంగాన్ని నాటకోత్సవాల ద్వారా మళ్లీ వెలుగులోకి తీసుకు రావడంతో పాటు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కళాకారులు ప్రదర్శిస్తున్న నాటికలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ రంగం ద్వారా సుపరిచితులైన ప్రముఖ రచయిత, సినీనటుడు పరుచూరి వెంకటేశ్వరరావు తన కుమారుడు రఘుబాబు స్మారకార్థం ఎన్నో ఏళ్లుగా నందమూరి తారక రామారావు కళా ప్రాంగణంలో నాటకోత్సవాలు నిర్వహిస్తూ నాటక రంగానికి పునరుత్తేజాన్ని అందిస్తున్నారన్నారు. పరుచూరి సోదరులు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం నాటక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు ఎమ్మెల్యే అందజేశారు.

ముగిసిన నాటకోత్సవాలు

గురువారం రాత్రితో నాటకోత్సవాలు ముగిశాయి. తొలి ప్రదర్శన ఇచ్చిన శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటికను పిటి మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. రెండవ ప్రదర్శన అభినయ ఆర్ట్స్ వారి ఇది అతని సంతకం నాటికను శ్రీస్నిగ్ధ రచించగా ఎన్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. రెండు నాటికలు ప్రేక్షకులను కట్టిపడవేసేలా కళాకారులు ప్రదర్శించారు. అనంతరం పరుచూరి విజయలక్ష్మి జీవితకాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నటి శివపార్వతి, నాటకోత్సవాల సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు, వ్యాఖ్యత అయినాల మల్లేశ్వరరావు, వేజండ్ల బసవపున్నారావు, సతీష్, శివరాంప్రసాద్, ఎం.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రా ధాన్యపు లారీలను అడ్డుకున్న పోలీసులు

● బారులు తీరిన ధాన్యపు లోడు వాహనాలు


పొందుగుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో పండించిన ధాన్యాన్ని మిరియాలగూడ తరలిస్తుండగా తెలంగాణ సరిహద్దు ఓడవల్లి, తంగెడ వద్ద పోలీసులు వాహనాలను అడ్డుకున్నారు. ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణ కు తీసుకు రావడానికి వీల్లేదని వాడపల్లి పోలీసులు అడ్డు కోవటంతో లారీ, ట్యాక్సీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం లోడుతో ఉన్న నాలుగు లారీలు, మూడు డీఎంసీ వాహనాలను వాడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తెలంగాణలో పండించిన ధాన్యానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు.. రాయితీలు కూడా ఇస్తోంది. రాయితీలు, మద్దతు ధర కేవలం తెలంగాణ రైతులకు మాత్రమే ఉపయోగ పడాలనేది పొరుగు రాష్ట్రప్రభుత్వ లక్ష్యం. కాగా, కొంత మంది వ్యాపారులు ఈ ప్రభుత్వ పథకాలను ఉపయోగించు కోవాలన్న ఆలోచనతో ఆంధ్రాలోని ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు స్పందిస్తూ.. తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని తరలిస్తున్నామని, తమను అడ్డుకోవడం అన్యాయమని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా దాచేపల్లి అంకాళమ్మ తల్లి కొలుపులతో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం ముగిశాయి. బండలాగుడు పోటీల్లో చివరి రోజు జూనియర్ విభాగంలో తెలం గాణలోని హైదరాబా ద్‌కు చెందిన డి.రోహన్ బాబు ఎడ్ల జత 3,158 అడు గులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలి చాయి. రెండవ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామా నికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,772 అడుగులు, మూడవ స్థానంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామా నికి చెందిన బుర్రముక్క కౌసల్యా రెడ్డి ఎడ్ల జత 2,565 అడుగులు దూరాన్ని లాగాయి. నాలుగవ స్థానంలో గుంటూరు జిల్లా రూరల్ మండలం లింగాయపాలెం గ్రా మానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 2,398, 5వ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామా నికి చెందిన దొడ్లపూడి గణేష్ ఎడ్ల జత 2,250 అడుగులు దూరాన్ని లాగాయి. విజేతలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు రూ2.10 లక్షలు నగదు బహుమతి అందజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

● రెండు కేజీలకు పైగా వెండి వస్తువుల అపహరణ


ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్ఐ అల్లూరి రెడ్డి

పెదకూరపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలోని నాలుగు డొంకల సెంటర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో దొంగలు పడ్డారు. రెండు కేజీలకు పైగా వెండి వస్తువులను అపహరించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వర్షం పడిన తర్వాత పథకం ప్రకారం ఆలయ ఉత్తర ద్వారం తాళం పగల గొట్టి లోపలకు వెళ్లి.. గర్భగుడి తాళం పగల గొట్టి గుడిలోని సీసీ కెమెరాలను తొలగించారని చెప్పారు. ఆంజనేయ స్వామికి అలంకరించిన కేజీ 25 గ్రాముల వెండి కిరీటం, రెండు దండల వెండి తమల పాకులు, స్వామి వారి మొలతాడు, కను బొమ్మలు, బొట్టు, జంజం, సుమారు రెండు నుంచి మూడు కేజీల వెండి వస్తువులను దొంగిలించారు. ఎస్ఐ అల్లూరి రెడ్డి దేవాలయంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ పరిశీలనలో ఎక్కడా వేలి ముద్రలు పడకుండా దొంగలు కాళ్లకు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకున్నారని తెలిపారు. దేవాలయం బయట జత చెప్పులను వదిలి వేశారని, రాత్రి వర్షం పడిన తర్వాత దొంగతనం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. పథకం ప్రకారమే సుమారు రెండు లక్షల రూపాయలకు పైబడి వెండిని అపహరించారని కమిటీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బీటెక్ విద్యార్థులకూ..ఎడ్‌సెట్ అవకాశం

పెదకాకాని, మే1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఎడ్ సెట్-2025 దరఖాస్తుకు బీటెక్ విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ విద్యార్థులు మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, మెథడాలజీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 14 వరకు కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏపీ ఎడ్ సెట్ వెబ్ సైట్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు బాధ్యతలు


రిజిస్ట్రార్ పీఎంవీ రావు

గుంటూరు(విద్య) మే1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముందుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంవీ రావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిబ్బంది నియామకం, శిక్షణ, పనితీరును పర్యవేక్షిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ

నరసరావుపేట టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ శుక్రవారం ఉదయం 8 గంటలకు జరుగుతుందని మందాడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు నిర్మించిన ఎన్ఎస్‌పీ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో విగ్రహావిష్కరణ రాష్ట్ర, జిల్లా కూటమి నాయకుల చేతుల మీదగా జరుగుతుందని పేర్కొన్నారు. కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో రక్తదానం, కంటి వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

కృష్ణానదిలో మునిగి బాలుడి మృతి


బాలుడి మృతదేహం

తాడేపల్లి టౌన్, మే 1, (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ ఓ బాలుడు మృతి చెందిన ఘటన గురువారం తాడేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన మురారి (14) కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం మహానాడులోని కృష్ణాతీరంలో ఉన్న ధ్యాన కేంద్రం వద్దకు వచ్చాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులందరూ కృష్ణానదిలో స్నానానికి దిగారు. లోతులోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తూ బాలుడు మునిగి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సుడిగుండాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పటిదాకా తమతోపాటు కేరింతలు కొడుతూ ఆడుకున్న కన్నబిడ్డ తమ కళ్లముందే అనంతలోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'పునఃనిర్మాణాన్ని' విజయవంతం చేయాలి:చీఫ్‌విప్

వినుకొండటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా జరుగుతున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కూటమి పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నాయకులకు దిశనిర్దేశం చేయడం జరిగిందని పేర్కొన్నారు. సీనియర్ నాయకుల సూచనల మేరకు కేటాయించిన బస్సుల్లో జాగ్రత్తగా అమవరాతి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, తిరిగి జాగ్రత్తగా ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు గురువారం తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

క్షేత్ర పాలికామహాదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్లలో భాగంగా రెండో రోజు శ్రీక్షేత్ర పాలికామహాదేవిగా అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం తొలుత శ్రీబగళాముఖి అమ్మవారికి ఉదయం 7గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వేదమంత్రాలతో అభిషేకాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు వైబీ రాజేంద్రప్రసాద్, బీ శ్రీరామశర్మ, పీ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పౌరసంబంధాలశాఖ ఏడీ


కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏడీ మోహనరాజు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : సమాచార, పౌర సంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టీ మోహనరాజు గురువారం కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

శోభాయాత్రకు ఘన స్వాగతం

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టౌన్‌హాల్లో జరగబోయే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశైలం దేవస్థానం వారి నిర్వాహణలో ధృతి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థ పర్యవేక్షణలో గురువారం శోభాయాత్ర నిర్వహించారు. దివ్యరథోత్సవానికి పలువురు ప్రముఖులు స్వాగతం పలికి శివపార్వతులకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ధృతి సంస్థ నిర్వాహకులు కళ్లం హరినాధరెడ్డి, జీవీఎల్ మోహన్ గౌడ్, కొత్రా రామకృష్ణ, బీజేపీ నాయకుడు బంగారుబాబు, జీవీఎల్ మోహన్‌గౌడ్, పరిశా రామకోటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార కార్డుల సిఫార్సు మేరకు ఎరువులు వాడాలి : ఏడీఏ


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ హుస్సేన్

వేమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి మూడు పంటల తరువాత తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని భూసార కార్డు సిఫార్సు మేరకే ఎరువుల వాడకం చేపట్టాలని బాపట్ల రైతుశిక్షణ కేంద్రం ఏడీఏ హుస్సేన్ సూచించారు. గురువారం వేమూరులో మండల వ్యవసాయశాఖ అధికారి సునీత అధ్యక్షతన జరిగిన రైతు సమావేశంలో హుస్సేన్ మాట్లాడుతూ భూసార పరీక్షలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. సునీత మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు ఎలా చేపట్టాలి.. మట్టి సేకరణ పద్ధతి గురించి వివరించారు. భూసార పరీక్షల సిఫార్సు మేరకు ఎరువులు వాడకం ద్వారా రైతులు సాగు ఖర్చును తగ్గించుకోవచ్చునని, అధిక దిగుబడులు కూడా పొందవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట పైరు సాగు సూక్ష్మ పోషకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రమీల, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాహిత కూటమి పాలన

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


వలివేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు (వేమూరు), మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాహితమైన కూటమి పాలన సాగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం ఆయన చుండూరు మండలం వలివేరులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి పాలన ద్వారా ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణం ద్వారా డెల్టా ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి ఆలోచనకు తగిన విధంగా ప్రజలు తమ వంతు సహకారం అందించాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా అధికారులు, ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హత కలిగి పింఛన్లు మంజూరు కానటువంటి వారికి ప్రభుత్వం త్వరలో అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు ఆయన చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ముస్లిం సంఘం ద్వారా ఆనందబాబును సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జెన్నిమ్మ, టీడీపీ నాయకులు శివారెడ్డి, ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి, శరత్‌చంద్ర, పవన్‌కుమార్, అలీషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

చుండూరు మండలంలోని పెనుగుదురుపాడు గ్రామానికి చెందిన మనం రత్తయ్య మెదడు సంబంధిత వ్యాధి తో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ సాయాన్ని కోరుతూ ఎమ్మెల్యే ఆనందబాబుకు దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లక్షా 25వేల రూపాయలు మంజూరు చేయించి సంబధించిన చెక్కును గురువారం రత్తయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు రత్తయ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

కొల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చిలుమూరులో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో గురువారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ మొలబంటి రామారావు, మా ర్కెట్‌యార్డు డైరెక్టర్ కుటుంబరావు, గాదె చంటి, బుర్రి జగన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అందరికీ పింఛన్లు

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


ముత్తాయపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ ప్రతినెల ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం ఆయన ముత్తాయపాలెంలో పంపిణీ చేశారు. పార్టీశ్రేణులు, అధికారులతో కలిసి ఇళ్ల వద్దకెళ్లి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రకారం పెన్షన్లు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ అధ్యక్షులు నరసింహారావు, మునేశ్వరరావు, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో పింఛన్ల పంపిణీ

కర్లపాలెం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరలిపాడు గ్రామంలో ఎన్టీ ఆర్ భరోసా పింఛన్లను ఎంపీడీవోవో అద్దూరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కరీముల్లా పంచాయతీ కార్యదర్శి కాంచన తదితరులు పంపిణీ చేశారు. నల్లమోతువారిపాలెంలో యూనిట్ ఇన్‌చార్జి మాడా శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, గ్రామ పార్టీ అధ్యక్షుడు మునిపల్లె చిన్న తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరిగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికెళ్లి పింఛన్ల పంపిణీ : కలెక్టర్ జేవీ మురళి


భీమావారిపాలెంలో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం పరిధిలో కలెక్టర్ జే వెంకటమురళి లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2లక్షల 78వేల52 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రతిఒక్కరికి 1వ తేదినే అందించాలనే సంకల్పంతో సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. ఉదయం 5గంటలు నుంచి అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి పింఛను పంపిణీ చేయటం ప్రారంభించారన్నారు. భీమావారిపాలెంలో కాకి సుబ్బులు అనే వృద్ధురాలికి రూ.4వేల పింఛను నగదు కలెక్టర్ అందజేశారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పఠాన్‌జానీబాషా అనే దివ్యాంగుడికి రూ.6వేల పింఛను నగదు అందజేయగా అద్దెగృహంలో ఉంటున్న తనకు సహాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. గృహనిర్మాణశాఖ ద్వారా గృహాన్ని మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లతో వృద్ధులకు భరోసా

● టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ


సామాజిక భరోసా పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ

కొల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు వృద్ధులకు భరోసా కల్పిస్తున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు. గురువారం కొల్లూరులోని సచివాలయం-2 పరిధిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రూ.4 వేలు, రూ.6 వేలు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదపూడి నాగరాజు, గాదె చంటి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఈమని మణికంఠ, కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పునఃప్రారంభ మహోత్సవానికి తరలిరండి

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పునఃప్రారంభ మహోత్సవానికి ప్రజలంతా తరలి రావాలని మైనేని మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేసి రాజధాని పనులను పునఃప్రారంభం చేయనున్నట్లు చెప్పారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి మండలం నుంచి వేలాదిగా ప్రజలు తరలి రావాలని ఆయన కోరారు. కొల్లూరులోని టీడీపీ కార్యాలయం నుంచి వాహనాలు బయలుదేరుతాయని తెలిపారు.

కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

● అనగాని శివప్రసాద్


పట్టణంలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నేత అనగాని శివ ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలో పలు వార్డుల్లో సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదికి మీగృహాలకు వచ్చి రూ.4వేలు పింఛన్‌ను అందిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని తెలిపారు. పురపాలక సంఘంలో అభివృద్ధి కోసం రూ.6కోట్లు నిధులను రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంజూరు చేయించారని తెలిపారు. ఎక్కువ మంది కొత్త పింఛన్ దరఖాస్తు కోసం అడుగుతున్నారని త్వరలో దరఖాస్తులను తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు, తాతా ఏడుకొండలు, పంతాని సాయికుమార్, కొలుసు ప్రశాంత్, శ్రీను, దేవగిరిరవి తదితరులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

● ఎరుకుల హక్కుల పోరాటసమితి రాష్ట్రఅధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మా


ఐక్యత చాటుతున్న దళిత, గిరిజన సంఘ నాయకులు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ఎరుకుల హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ మోహన్‌కుమార్ ధర్మా డిమాండ్ చేశారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మారలేదన్నారు. గిరిజనుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. మైదాన ప్రాంతంలో 8జిల్లాల్లో సుమారు 15లక్షల మంది గిరిజనులు ఉండగా వారికి రాజకీయ రిజర్వేషన్ లేకపోవటం శోచనీయమన్నారు. సమావేశంలో అంబేద్కర్ సేవాసమాజం అధ్యక్షుడు దగ్గుమల్లి కిరణ్‌కుమార్, గిరిజన నాయకులు బి.కిరణ్, బాలిగ బ్రహ్మయ్య, శామ్యూల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను జయప్రదం చేయండి.. రాష్ట్ర భవిష్యత్తుకు పునాది వేయండి

● బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర భవిష్యత్తుకు పునాది వేయడానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను జయప్రదం చేయాలని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు పిలుపునిచ్చారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యంతో కూడిన ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తాడికొండ దయాబాబు, మైనార్టీ సెల్ నాయకుడు మస్తాన్ పాల్గొన్నారు.

చంద్రమౌళిపార్కులో శిథిలావస్థలో ఆట వస్తువులు

● చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
● వేసవి సెలవుల్లో పిల్లలకు నిరాశ


శిథిలావస్థకు చేరిన వాటర్‌ఫౌంట్


విరిగిపోయిన పిల్లలు ఆడుకునే రౌండ్ చక్రం

రేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో ఐదు దశాబ్దాల కీర్తి కలిగిన చంద్రమౌళిపార్కులో ఆటవస్తువులు శిథిలావస్థకు చేరటంతో పార్కుకు ఆడుకుందామని వచ్చిన చిన్నారులకు నిరాశే మిగులుతుంది. ఎప్పటికప్పుడు లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కును అభివృద్ధి చేస్తున్నామంటూ అధికారులు చెప్పే మాటలు నీటిమూటలుగానే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం పార్కుల పరికరాలపై దృష్టి సారించక పోగా మరమ్మతులు కూడా నిర్వహించకపోవటంతో ఆటవస్తువులు శిథిలమయ్యి నేల వాలిపోయాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలు ఆడుకుందామని పార్కుకు వస్తే నిరాశే మిగిలింది. పట్టణంలోని చంద్రమౌళి పార్కుకు ఎంతో ఘనకీర్తి ఉంది. అధికారులు దృష్టి సారించకపోవటంతో పార్కులోని ఆట వస్తువులన్నీ పనికిరాకుండా పోయాయి. మున్సిపల్ అధికారులు మాత్రం వాటిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. లక్షలాది రూపాయలు వెచ్చించి పురపాలక సంఘానికి ఆట వస్తువులను ఏర్పాటు చేస్తే కనీస మరమ్మతులు కూడా నిర్వహించకపోవటంతో అవన్నీ శిథిలమైపోతున్నాయి. కూటమి పాలనలోనైన అధికారులు దృష్టి సారించి పార్కులోని ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని పట్టణవాసులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలమైన చిన్నారులు ఆడుకునే వస్తువులు

అమరావతిలో ప్రధాని సభకు తరలిరండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు బంగారుబాబు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరాతిలో జరుగు కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్న సందర్భంగా కూటమిశ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు పిలుపునిచ్చారు. ఈ విషయమై గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అభివృద్ధి పనులకు ప్రత్యక్ష, పరోక్షంగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున ప్రజానీకం తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ మణియాదవ్, బ్రహ్మాండం బాలనారాయణ, కొండారెడ్డి అనీల్, కాకర్ల వెంకటేశ్వరరావు, కొత్రా వెంకట రామకృష్ణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.


జనాభా లెక్కలతో పాటు కులగణన శుభపరిణామం

● సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు


హర్షం వ్యక్తం చేస్తున్న మేదా శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త కుల, జనగణన అమలు సామాజిక న్యాయ ప్రక్రియకు శుభపరిణామమని సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు తెలిపారు. జీబీసీరోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద గురువారం మేడే వేడుకలు నిర్వహించి కులజనగణనకు ఆమోదం తెలపటాన్ని హర్షిస్తూ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం 1881 నుంచి 1931 వరకు జనాభా లెక్కలతోపాటు కులజనగణన జరిగిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేవలం ఎస్సీ, ఎస్టీలను మాత్రమే లెక్కిస్తూ మిగతా ఓసీ, బీసీలను కలిపి లెక్కిస్తున్నారన్నారు. బీసీ నాయకుల కృషితో ప్రభుత్వం కులజనగణనకు ఆమోదం తెలపటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విలియంబూత్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, మాజీ కౌన్సిలర్ జెట్టి జోసఫ్, గండికోట వెంకట్రావు, కాండ్రు శరత్‌కుమార్, బోయన సూరిబాబు, కొమ్మనబోయన ఫణికుమార్, యర్రాకుల వాసు, దర్శి బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం గెలుస్తుంది : బీసీ నాయకులు


ప్రధానీ మోదీ, కేసన శంకరరావు పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

బాపట్ల, మే1 (ఆంధ్రజ్యోతి) : కుల, జనగణన జరపటం ద్వారా సామాజిక న్యాయం గెలుస్తుందని దీని కోసం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పోరాటం చేశారని బాపట్ల నాయకులు పేర్కొన్నారు. సమగ్ర కులగణన జరుపుతామని కేంద్రమంత్రి మండలి ప్రకటించటాన్ని హర్షిస్తూ బెస్తపాలెం మహాత్మాగాంధీ కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ, కేసన శంకరరావు పటాలకు క్షీరాభిషేకం చేశారు. జనగణనతో పాటు సమగ్ర కులగణన జరపాలని కేశన నేతృత్వంలో అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల సాయి, కంకణాల రాంబాబు, కొండా రాంబాబు, జంపాల సాయి, పుల్లయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి న్యాయవాదుల నిరసన


జిల్లా కోర్టుల సముదాయం ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక మారణకాండకు నిరసన తెలియజేస్తూ బాపట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉగ్రవాదుల హత్యాకాండకు నిరసనగా గురు, శుక్రవారాలు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్ తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, సీనియర్ న్యాయవాదులు సీ ప్రేమ్‌చంద్, జెడ్ బాషా, డి.భాస్కరరావు, వై నరేష్, ఉపాధ్యక్షుడు కె.రవి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నరేష్, ఫిలిప్, లేళ్ళ శ్రీనివాసరావు, కంచర్ల రవిబాబు, నాగమోహిని, మాధురి, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను రక్షించుకుందాం

● సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ
● ఘనంగా మే డే



బాపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బాపట్ల, మే1 (ఆంధ్రజ్యోతి) : మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను రక్షించుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను గురువారం బాపట్లలో ఘనంగా నిర్వహించారు. ఎఐటీయుసి, సీపీఐ జెండాలను పట్టణంలోని పలుప్రాంతాలలో ఆవిష్కరించారు. ర్యాలీలు నిర్వహించారు. రిక్షా యూనియన్‌లు, ఆటోయూనియన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కార్మికుల ఐక్యతను చాటుకున్నారు. మహానేతల త్యాగాలు, కార్మికుల చారిత్రాత్మక పోరాటాలతో చట్టాలను తెచ్చుకున్నామని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయుసి కార్యదర్శి నన్నమూరి శ్రీనివాసరావు, సీపీఐ కార్యదర్శి బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● కార్మికహక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలకు సిద్ధంకావాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ పిలుపునిచ్చారు. పాతబస్టాండ్ ఆటోవర్కర్స్ యూనియన్ పాయింట్ దగ్గర, వ్యవసాయ కళాశాల వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, ఆహార విజ్ఞానసాంకేతిక కళాశాల, ఆర్టీసీ గ్యారేజి, బస్టాండ్ వద్ద జెండాలు ఆవిష్కరించారు.

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి బాపట్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లానాయకులు మేకల ప్రసాద్ ఆయా ప్రాంతాలలో జెండా ఎగురవేసి మేడే విశిష్ఠతను వివరించారు. పెయింటర్స్ కాలనీలో తాపీవర్కర్స్ యూనియన్ కమిటీ హాలునందు మేడే వేడుకలు ఘనంగా జరిగాయి.

● కర్లపాలెం గౌడపాలెం వద్ద మేడే సందర్భంగా యూరియా ముఠా కార్మికులు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు, ఖాజీపాలెం, రెడ్డిపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, భవనంవారిపాలెం, అల్లూరు,సంగుపాలెం తదితర గ్రామపంచాయతీలలో మే డే జెండాను ఎగురవేశారు.

వేమూరు నియోజకవర్గంలో..

వేమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో, జంపని గ్రామంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, తాపీ వర్క ర్స్ యూనియన్, పంచాయతీ వర్కర్స్ యూనియ న్, రైస్ మిల్లర్స్ ముఠా కార్మికులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సీఐ టీయూ పతకాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుల్లారావు, నాగేశ్వరరావు, తాడిబోయిన సాంబశివరావు, సూర్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **కొల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి)** : మే డే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో తోకలవానిపాలెంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు అధికారి మేడికొండ అనీల్‌కుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు టి.సుభాషిణి, నాయకులు రమేష్, దాసు, వి.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. భట్టిప్రోలు, కొల్లూరులతో పాటు గ్రామాల్లో సైతం సీపీఎం, సీఐటీయూ నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, పంతగాని నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు, రిక్షా కార్మికుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె నియోజకవర్గంలో..

రేపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పి.నాగాంజనేయులు, సీపీఐ రేపల్లె కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. గురువారం పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూసీ, సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో మేడేని పురస్కరించుకుని జెండాను మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఆటోవర్కర్స్ యూనియన్, వ్యవసాయ మార్కెటింగ్ యార్డు, సివిల్ సప్లయ్స్ గోదాము వద్ద, రింగ్‌రోడ్ సెంటర్లో, రైల్వే స్టేషన్ అంకమ్మచెట్టు, ప్రభుత్వ వైద్యశాల, నెహ్రూబొమ్మ, వేజళ్ళవారిలంక రైస్‌మిల్లు తదితర ప్రాంతాల్లో ఎర్రజెండాను ఆవిష్కరించారు.

● **చెరుకుపల్లి (ఆంధ్రజ్యోతి)**: చెరుకుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కార్మికులు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి విజయబాబు జెండా ఎగురవేశాడు.

● **నగరం (ఆంధ్రజ్యోతి)**: నగరంలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి మేడే శుభాకాంక్షలను తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్, అంగన్ వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సిద్ధమైన సభా వేదిక

భద్రత కట్టుదిట్టం

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజధాని ప్రాంతమంతా గడిచిన రెండు రోజులుగా పోలీస్ వలయంలో ఉంది. 6 వేల మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం చివరి క్షణంలో మరో 300 మంది అదనపు బలగాలని రప్పించారు. ప్రధాని పర్యటించే ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాని పాల్గొని బహిరంగ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండడానికి కొన్ని వాహనాలకు సంబంధించి పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఆయా నిబంధనలు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమలులో ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు.

వేదిక చుట్టూ ఎస్పీజీ, గ్రేహౌండ్స్

ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభ వేదిక చుట్టూ ఎస్పీజీ బలగాలతో పాటు గ్రేహౌండ్స్ పూర్తి అప్రమత్తంగా పహారా కాయనున్నాయి. వీరి తర్వాత వేదిక చుట్టూ షూటర్స్ డేగకళ్లతో పరిస్థితులను నిశితంగా గమనిస్తూ ఉంటారు. ఆ తర్వాత ఆర్మ్డు రిజర్వు, ఏపీఎస్పీ బలగాలు విధుల్లో ఉంటాయి. ప్రతి గ్యాలరీ వద్ద సాయుధ బలగాలు నిఘా వేయనున్నాయి.

సభకు వచ్చే మార్గాల వివరాలు

కార్యక్రమానికి వీఐపీలకు ప్రత్యేక రూట్ మ్యాప్ ఇచ్చారు. ప్రకాశం బ్యారేజీ, స్క్యూ బ్రిడ్జి, ఉండవల్లి గుహలు దాటిన తర్వాత కుడివైపు తీసుకుని సబ్ స్టేషన్ రోడ్డులో నుంచి కరకట్ట రోడ్డు మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి వెళ్లి అక్కడి నుంచి వీఐపీ పార్కింగ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది.

- కాజా టోల్‌గేట్ సర్వీస్ రోడ్డు నుంచి మురుగన్ హోటల్ వద్ద ఎడమవైపు తీసుకుని వెస్ట్ బైపాస్ మీదగా పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ మార్గంలో గుంటూరు నుంచి 1800, పల్నాడు నుంచి 500 బాపట్ల నుంచి 350 ప్రకాశం నుంచి 190 వాహనాలు రానున్నాయి.
- గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ఈ సెవెన్ జంక్షన్ మీదగా కేటాయించిన పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ రోడ్డులో గుంటూరు నుంచి 700 వాహనాలు రానున్నాయి.
- అమరావతి వైపు నుంచి పెదమద్దూరు, వైకుంఠపురం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, రాయపూడి వై జంక్షన్ నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదగా న్యూ పార్క్ రోడ్డులో నుంచి పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ మార్గంలో పల్నాడు జిల్లా నుంచి 600 వాహనాలు రానున్నాయి.
- వీవీఐపీ వాహనాలకు ప్రకాశం బ్యారేజ్ - లోటస్ పాయింట్ - కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్(ఈ3) - ఎన్9 జంక్షన్ - సభా ప్రాంగణానికి చేరుకుని పీ8, పీ9 సెక్టార్లలో పార్కింగ్ చేయాలి.
- సభా ప్రాంగణం - ఈ3 రోడ్డు - కరకట్ట రోడ్డు - ప్రకాశం బ్యారేజ్ ద్వారా విజయవాడ వెళ్లవచ్చు.
- అత్యవసర సేవలకు సంబంధించిన వాహనదారులు సభా ప్రాంగణం - ఎన్9 జంక్షన్ - కురగల్లు - నిడమర్రు - మంగళగిరి నుంచి వెళ్లవచ్చు.







నవశకానికి.. నేడే నాంది

(5వ పేజీ తరువాయి)

వరాల జల్లు కురిపించేలా మోదీ హామీలు ఇస్తారని చాలామంది ఆశిస్తున్నారు.

మంత్రుల సమీక్షలు..

గురువారం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్లో మంత్రుల కమిటీ సమావేశం నిర్వహించింది. పర్యవేక్షణ అధికారులతో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిలతో మంత్రి నారాయణ సమావేశమై కార్యక్రమానికి వచ్చే ప్రముఖులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వివిధ జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి నారాయణ టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇక రాజధానిలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని, రాజధాని రైతులు ఇంటింటికీ తిరిగి ఆహ్వానిస్తున్నారు.

విధ్వంసం నుంచి పునర్వికాసం

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించుకున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. గృహ, భవన నిర్మాణ పనులకు సంబంధించి రూ.12,700 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఐకానిక్ బిల్డింగ్స్ కేటగిరీలో సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అఖిల భారతస్థాయి అధికారుల భవనాలు ఉన్నాయి. రాజధానిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.16,200 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ఆర్టీరియల్ రోడ్లు, సబ్ ఆర్టీరియల్ రోడ్లు, ఫ్లడ్ మిటిగేషన్ పనులు ఉన్నాయి. ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా కింద రూ.20,100 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ నెట్‌వర్క్ వంటి అనేక పనులు వీటిలోనే ఉంటాయి.

ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల సమీకరణ

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పిలిచిన వాటికి, పిలవాల్సిన వాటికి సంబంధించి ఇంకా రూ.74 వేల కోట్ల నిధులు కావాల్సిన అవసరం ఉంది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు వస్తే మరో రూ.69 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నేషనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

వెలగపూడిలో జరిగే సభకు వచ్చే వారికి అనుకూలమైన రహదారులను అధికారులు అందంగా తీర్చిదిద్దారు. ఎంవీఐపీ, వీవీఐపీ, వీఐపీలకు కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్లను సిద్ధం చేశారు. విజయవాడ వైపు నుంచి వచ్చేవారి కోసం సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డును సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి వచ్చేవారి కోసం వెస్ట్ బైపాస్ నుంచి ఈ-11 రోడ్డు మీదగా నిడమర్రు, కురగల్లు నుంచి వెలగపూడికి చేరుకోవచ్చు. తాడికొండ మీదగా వచ్చేవారు ఎన్-9 రోడ్డు మీదగా సభావేదికకు చేరుకోవచ్చు. సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అక్కడే తాగునీరు, మజ్జిగ, ఆహార సదుపాయాలు కల్పించారు. జిల్లాల వారీగా బస్సులకు రూట్‌మ్యాప్‌లు ఇచ్చేశారు. ఉదయం 11 గంటలకే బస్సులు వెలగపూడి చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా కీలకమైన ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు కేటాయించారు.

ప్రధాని సభకు 1,900 బస్సులు

- అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ఏర్పాటు
- రాష్ట్ర వ్యాప్తంగా అమరావతికి తరలివస్తున్న ప్రజలు
- సాధారణ ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి విచ్చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఆర్టీసీ సమాయత్తమైంది. మొత్తం 1,900 బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఇతర డిపోల నుంచి బస్సులని సమకూర్చింది. అటు విశాఖ, శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం, కడప, కర్నూలు వంటి ప్రాంతాల డిపోల నుంచి బస్సులను అమరావతి సభకు ఏర్పాటు చేశారు. ప్రధాని సభకు వెళ్లాల్సిన బస్సులు గురువారం రాత్రికే గుంటూరు చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సభకు తరలిరానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు శుక్రవారం ఉదయానికి చేరుకునేలా ఏర్పాటు చేశారు. జన సమీకరణకు సంబంధించి ముందుగానే ఆయా ప్రాంతాల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుల్లో ప్రజలను తీసుకొచ్చేలా ప్రణాళి కలు వేస్తున్నారు. ప్రజల్ని సభకు తీసుకురావడం.. అనంతరం గమ్యస్థానాలకు చేర్చడం వరకు మానిటరింగ్ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించారు. బస్సులు కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించిన అమరావతి పునఃప్రారంభోత్సవానికి తరలివచ్చేందుకు ప్రజలు కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతోన్న నేపథ్యంలో ప్రత్యక్షంగా సభను తిలకించేందుకు ఎంతో ఆశ పడుతున్నారు.



మోడీ సభకు తరలి వెళ్లేందుకు పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న బస్సులు

సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..

సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందుకోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కారణంగా పెద్దగా ప్రయాణికుల రద్దీ లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సర్వీసులు కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి పర్యవేక్షిస్తామని తెలిపారు.

యూపిక్స్.. ఐపీ

లబోదిబోమంటున్న బాధితులు

రూ.2.72 కోట్లు ఆస్తులు.. రూ.155.95 కోట్లు అప్పులు

నరసరావుపేటకు చెందిన ఐదుగురి పెట్టుబడి రూ.65.5 కోట్లు

నరసరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశచూపి భారీగా పెట్టుబడులు సేకరించిన యూపిక్స్ క్రియేషన్స్ యానిమే షన్ సంస్థ నిర్వాహకుడు నిడుమోలు వెంకటసత్యలక్ష్మీకిరణ్ ఇటీవల బోర్డు తిప్పేశాడు. ఈ సంస్థ బాధితుల్లో నరసరావుపేట వాసులే ఎక్కువగా ఉన్నారు. విజయవాడకు చెందిన ఇతడు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో ఐపీ పిటిషన్‌ను దాఖలు చేశాడు. 2014లో సంస్థను ఏర్పాటు చేసి రూ.155.95 కోట్లు పెట్టుబడులుగా సేకరించినట్లు 102 మంది జాబితాను కిరణ్ కోర్టుకి సమర్పించాడు. నరసరావుపేట వారితో పాటు విజయవాడ, గుంటూరు, హైదారాబాదు తదితర ప్రాంతాల వారు కూడా కిరణ్ సంస్థలో బాధితులుగా ఉన్నారు. నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి రూ.15 కోట్లు, మరో వ్యాపారి 15.50 కోట్లు, ఇంకో వ్యక్తి రూ.5 కోట్లు, మరొకరు రూ.18 కోట్లు, ఇంకొకరు రూ.12 కోట్లు, మరికొందరు రూ.కోటి నుంచి నాలుగు కోట్ల వరకు సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టారు. మూడేళ్లలో ఓ పథకం ప్రకారం దాదాపు రూ.400 కోట్లు పెట్టుబడులు సేకరించి సంస్థను మూసి వేశాడు. రూ.2.72 కోట్లు మాత్రమే ఆస్తులు, రూ.155.95 కోట్లు అప్పులు ఉన్నట్లు ఐపీ పిటిషన్ దాఖలు చేయడంతో మిగతా సొమ్మును ప్రస్తావించలేదని బాధితులు వాపోతున్నారు. ఐపీ పిటిషన్‌లో నరసరావుపేటకు చెందిన వారి కొందరి పేర్లు లేనట్లుగా బాధితులు తెలిపారు. ఇటీవల వరకు కొంతైనా సొమ్ము తిరిగి వస్తుందన్న బాధితులు ఆశలపై కిరణ్ నీళ్లు చల్లాడు. అప్పులు చేసి సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇద్దరు వ్యాపారులు వారి ఆస్తులు విక్రయించి బాకీలు తీరుస్తున్నట్లు తెలిసింది. ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.

ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వవైభవం

మంత్రి బీసీ జనార్దనరెడ్డి

పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వపు వైభవం వస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సాంప్రదాయ పూజలు చేసి, పోటీలను ప్రారంభించారు. అతిథులు ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, టంగుటూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు ప్రాంగణంలోని ఎన్టీఆర్, వీరయ్యచౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిరోజు రాష్ట్ర నలుమూలల నుంచి 17 జతల ఎడ్లు టచ్ పళ్ల విభాగంలో 600 కిలోల బండను హోరాహోరీగా లాగాయి. సందర్భంగా జరిగిన సభలో మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నారని, మండు వేసవిలో వడ్లమూడిలో పందేలు నిర్వహించడం సాహసోపేతమన్నారు. ప్రతి గ్రామంలో పూర్వం దూలపు ఎడ్లను పెంచి పందేలు నిర్వహించడం ద్వారా రైతులకు గుర్తింపు వచ్చేదన్నారు. ప్రస్తుతం అలాంటి గుర్తింపు తీసుకువచ్చేలా వీరయ్యచౌదరి మెమోరియల్ కృషిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్, తన తండ్రి వీరయ్యచౌదరి పేరుతో ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకుని ప్రతి రైతు ఒంగోలు జాతిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.



బరిలో బండ లాగుతున్న ఎద్దులు



ఎద్దుల రైతులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

రాజధాని రైతుల కన్నీళ్లకు చెక్

ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు రూ.20 వేల కోట్లు

ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంసంతో భూ దాతలకే ఎక్కువ నష్టం

ఈ సారి ఆ తప్పు జరగనివ్వకుండా ప్రథమ ప్రాధాన్యం రైతులకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చడానికి అమరావతి ప్రాంత రైతుల సహకారం ఎనలేనిది. ఎంతో పెద్ద మనసు తో 34 వేల ఎకరాలను పైసా ఆశించకుండా ఇచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజధాని విధ్వంసా నికి గురి కావడంతో భూములిచ్చినందుకు రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు మంచి జరగబోతోంది. రైతులకు ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కేటాయించినా వాటికి తగ్గ మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. ఈ సారి ఆ తప్పు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా(రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయలు) కింద రూ.20 వేల కోట్లను ఖర్చు చేస్తోంది. రెండేళ్లలోనే రైతులకు ప్లాట్లు కలిగిన లే అవుట్లు అన్నీ అభివృద్ధి చెందనున్నాయి. రాజధాని అభివృద్ధి కోసం భూ సమీకరణ విధానాన్ని జనవరి 1, 2015న ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్థానిక రైతులు, ప్రజల అభిప్రాయాల ఆధారంగా భూ సమీకరణ ముసాయిదా అనంతరం సీఆర్ డీఏ అధికారులు భూ సమీకరణలో మార్పులు చేశారు. ప్రభావిత కుటుంబాలకు మరింతగా ప్రయోజనాలు, పరిహార ప్యాకేజీలను ప్రకటించింది. భూ సమీకరణ పథకంలో చేసిన సవరణలతో రాజధాని ప్రాంత రైతులు తమ భూములను రాజధాని నిర్మాణం కోసం ఇచ్చేందుకు అంగీకరించారు.

విజయవంతమైన మోడల్..

భూ సమీకరణ విధానం ప్రపంచంలోనే టాప్ మోడల్‌గా నిలిచింది. ఈ విధానాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో ఎంత విజయవంతమైందో అర్థమౌతోంది. ల్యాండ్ పూలింగ్ విధానం అనేది భూమిని తీసుకోవటం మాత్రమే కాదని, భవిష్యత్తును సమిష్టిగా నిర్మించే విధాన మని ప్రభుత్వం ప్రపంచానికి చూపించింది. రాజధానిలో 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 34,000 ఎకరాలకు పైగా భూమిని రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారు. అమరావతిని దేశం లోనే మొట్టమొదటి ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న రాజధానిగా నిలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు పారదర్శకంగా 65,000కి పైగా ఈ - లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు.

జాప్యంతో.. నష్టపోయిన రైతులు

రైతులకు ప్యాకేజీ కింద ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు కలిగిన లే అవుట్లను సకల సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సి ఉండగా.. అప్పట్లో ఈ పనుల విషయంలో కొంత జాప్యం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి వినాశనంతో అందరికంటే ఎక్కువగా రైతులు ఇబ్బందులు పడ్డారు. గత తప్పిదాలను పునరావృత్తం కానీయకుండా ఉండేందుకు ఈ సారి ప్రభుత్వం లేఅవుట్ల, ప్లాట్ల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. రెండేళ్లలో ఈ పనులు పూర్తి కానున్నాయి.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం

రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను త్వరిగతిన పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి, రాజధాని రైతులకు అందుబాటులో ఉండేలా అమరావతిలో 11 యూనిట్ ఆఫీసులను, తొమ్మిది ప్రాంతాలలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలను సీఆర్‌డీఏ ప్రారంభించింది. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే వార్షిక కౌలు ప్రకటించింది. భూమిలేని పేదలకు ప్రతి నెలా రూ.5 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. రైతుల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అందిస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.



అవీ..ఇవీ..

మోదీ సభకు తరలిరావాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బల్లికురవ. మే 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజదాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం అమరావతికి వస్తున్నారని పార్టీ నేతలు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగొంట్ల కోటేశ్వరరావు కోరారు. బల్లికురవ మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అధికారులతో, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, అయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా అమరావతి రాజధానిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక డిజైన్‌తో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇందుకు ప్రజలంతా మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

పంగులూరు: భారత ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటన కార్యక్రమంలో ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి బాలమ్మ అన్నారు. ప్రధాని అమరావతి పర్యటనకు మండలం నుంచి 11 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సిబ్బంది వ్యవహరించాలని కోరారు. బస్సులలో ఎక్కిన ప్రజానీకానికి ఉదయం 8 గంటలకు సచివాయాల వద్ద అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై తాతపూడి వద్ద ఉదయం, సాయంత్రం భోజన ప్యాకెట్లు అందజేస్తామన్నారు. బస్సులలో మహిళా పోలీస్‌తో పాటు వైద్య సిబ్బంది ప్రజలతో ఉండి వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని బాలమ్మ కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, ఏఈ హనుమంతరావు, శివయ్య, ఏపీఎం జ్యోతిప్రసాద్, ఏపీవో సంతోషం, రెవెన్యూ, పంచాయతీరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి సభకు 26 బస్సులు

అద్దంకి : అమరావతి పునఃనిర్మాణ సభకు ప్రజలు తరలివెళ్లేందుకు అద్దంకి డిపో నుండి 26 బస్సులను కేటాయించినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి డిపో బస్సులను కాకుమాను మండలంలోని గ్రామాలకు కేటాయించగా బుధవారం సాయంత్రం బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. అద్దంకి డిపోలో అద్దె బస్సులతో కలిపి మొత్తం 62 బస్సులుండగా, 26 ఆర్టీసీ బస్సులను సభకు తీసుకు వెళ్లే ప్రజల కోసం పంపినట్లు, మిగిలిన బస్సులు ఆయా రూట్లలో తిరుగుతాయన్నారు.

ఇంకొల్లు నుంచి అమరావతికి 11 బస్సులు

ఇంకొల్లు : రాజధాని అమరావతి పుననిర్మాణానికి విచ్చేయుచున్న ప్రధానమంత్రి మోడీ బహిరంగసభకు ఇంకొల్లు మండలం నుండి 11 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎపిఎం అనూరాధ తెలిపారు. 2వ తేదీ ఉదయం 9 గంటలకు బస్సులు ఆయా గ్రామాల నుంచి బయలుదేరతాయన్నారు. వీరందరికీ, అల్పాహారం, భోజనం, మజ్జిగ, మంచినీరు వంటి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు కోరారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల



పూజల్లో పాల్గొన్న కరణం వెంకటేష్

వేటపాలెం(చీరాల), మే 1 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయి పేట గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తిరునాళ్లు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

దేశాయి పేటలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. పోలేరమ్మ, పోతురాజు విగ్రహాల పునఃప్రతిష్ఠ, శేఖర కలిశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తిలకించారు. ఆయన వెంట పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాతి మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఈవో తిమ్మానాయుడుకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

అద్దంకి, మే 1 (ఆంధ్రజ్యోతి): శింగర కొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకికి చెందిన చల్లాపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు గురువారం రూ.1,00,116లను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. శ్రీనివాసరావు కుటుంబసభ్యులు వీరాంజమ్మ, శ్రీనివాసనవీన్, కొల్లా వెంకటరత్తమ్మ, యర్రా చలపతిరావులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు కిట్లు అందజేత



క్రీడాదుస్తులను అందజేస్తున్న ఎస్.ఐ రమేష్, ముసలారెడ్డి

చినగంజాం, మే 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, చినగంజాం బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు క్రీడా కిట్లును అందజేశారు. గత నెల 20వ తేదీ నుండి క్రీడాకారులకు కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.గిరిబాబు తెలిపారు. కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 70 మంది క్రీడాకారులకు యర్రం పిచ్చమ్మ జ్ఞాపకార్థం రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి రూ.25 వేల రూపాయిలు విలువ చేసే క్రీడాకిట్లు, జీటి.అంకిరెడ్డి, చిట్టా మధుసూదన్‌రెడ్డిలు 30 మంది క్రీడాకారులకు పదివేల రూపాయిలు విలువైన క్రీడా కిట్లు అందజేసినట్లు తెలిపారు. దాతలు అందజేసిన క్రీడాకిట్లును ఎస్.ఐ శీలం రమేష్, సీనియర్ కబడ్డీ, చెడుగుడు క్రీడాకారుడు ఆట్ల ముసలారెడ్డిలు క్రీడాకారులకు గురువారం అందజేశారు. కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు పెన్షన్‌తో మేలు

- ఎమ్మెల్యే కొండయ్య
- గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి ఆసరా లేక అవస్థలు పడుతున్న అవ్వా, తాతలకు టీడీపీ కూటమి అందిస్తున్న పెన్షన్‌తో ప్రయోజనమని, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు, నిరాశ్రయులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక 29వ వార్డు, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలు ఒడిదుడుకులు ఎన్నున్నా పెన్షన్లలో జాప్యం ఉండదని, ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని అన్నారు. అలాగే మున్సిపల్ 29వ వార్డులో సుమారు స్థానిక నాయకులు వల్లెపు వేణు ఆధ్వర్యంలో 100 కుటుంబాలను పార్టీలోకి కండువాతో ఆహ్వానించారు. చల్లారెడ్డిపాలెంలో చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, మునిసిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురామ్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ : ఎన్నికలలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకొని పింఛన్ల సొమ్మును రెట్టింపు చేసి నిరుపేదలకు అండగా నిలిచిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగొంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం బల్లికురవ మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, టీడీపీ మండల నాయకులు గొట్టిపాటి లక్ష్మయ్య, సర్పంచ్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామంలో నూతనంగా ఎన్నికైన టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యం లో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదా రులకు టీడీపీ మండల నేత కుక్కపల్లి ఏడుకొండలు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, గ్రామకమిటీ నూతన అధ్యక్షులు వేల్పుల మరియదాసు, ఉపాధ్యక్షులు మేకపోతుల మోహన్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కుక్కపల్లి నరేష్‌లు స్థానిక సిబ్బందితో కలసి ఫించన్లు అందచేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి ఏసుబాబు, వేల్పుల జయప్రకాష్, మాజీ అద్యక్షులు, చింతల నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన శ్రీనివాసరావు

పట్టణంలో 94.5 శాతం, గ్రామాల్లో 95 శాతం పంపిణీ

అద్దంకి : పింఛన్ల పంపిణీని గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ కూటమి నేతలు పర్యవేక్షించారు. గురువారం రాత్రి 7 గంటల సమయానికి అద్దంకి పట్టణంలో మొత్తం 3,823 మందికి గాను 3613 మందికి పంపిణీ చేసి 94.51 శాతం పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అద్దంకి మండల పరిధిలో మొత్తం 6915 మందికి గాను 6568 మందికి పంపిణీ చేసి 94.98 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు.

భర్త చనిపోయిన నెలకే భార్యకు పెన్షన్

- ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే ఏలూరి
- గిరిజన వృద్ధ మహిళకు పెన్షన్ పంపిణీ

పర్చూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయి నెల రోజుల తిరకముందే భార్యకు గురువారం వింతంతు పెన్షన్ అందించి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. మండల కేంద్రమైన పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన దేవరకొండ కోటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావటం, భర్త ఆకస్మిక మరణంతో వృద్ధురాలు తిరుపతమ్మ ఆందోళనకు గురిఅయ్యింది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి 'సాంబశివరావు యద్ద ప్రాతిపతికన ప్రభుత్వ పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్షణం స్పందించిన అధికారులు వృద్ధురాలకు పెన్షన్ మంజూరు చేశారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధికారుల సార్థ్యంలో పెన్షన్ వృద్ధురాలికి అందజేశారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అద్యక్షులు షేక్.షంషుద్దీన్, కోడూరి శేషబ్రహ్మాచారి, ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శివరాం ప్రసాద్, షేక్.గౌస్, షేక్.ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

పార్టీ పార్టీనే... అవిశ్వాసం అవిశ్వాసమే..!

- ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ కలిసిన వేళ చమక్కులు
- మరోసారి పార్టీ కండువా కప్పిన ఎమ్మెల్యే

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు గురువారం ఒకే వేదికపై కలుసుకోగా, వారి సంభాషణ నవ్వులు పూయించింది. ఛైర్మన్ జంజనంపై ఎమ్మెల్యే వర్గీయులు అవిశ్వాసం ప్రకటించిన నాటి నుండి చీరాల్లో రాజకీయ పరిస్థితులు వాడీవేడీగా మారాయి. దీంతో రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చోపచర్చలు సాగాయి. కానీ ఇక్కడి పరిస్థితులు, రాజకీయ సమీకరణాలతో సరదా వాతావరణంలో సాగుతున్నాయి. బుధవారం జంజనం శ్రీనివాసరావు ఎమ్మెల్యే కొండయ్య టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ క్రమంలో దాదాపుగా అవిశ్వాస సమావేశంలో ఎమ్మెల్యే వర్గీయుల మద్దతు జంజనంకు ఉంటుందని ఊహాగానాలు వినిపించాయి. అయితే గురువారం మోదీ పర్యటనకు సంబంధించిన జరిగిన విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా సమావేశంలోకి జంజనం హాజరయ్యారు. ఈక్రమంలో ఓవైపు ఆయన్ను అందరి పలుకరించారు. అలాగే ఎమ్మెల్యే కూడా బాగానే ఆహ్వానించారు. అయితే అక్కడున్న నేతలు, కార్యకర్తలు వారి సమక్షంలో జంజనంకు పార్టీ కండువా కప్పాలని ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా అందరికీ వంత పాడుతూ ఛైర్మన్ కూడా లేచి నిలబడి పార్టీ కండువా మెడలో వేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఒకింత అక్కడ సరదా వాతావరణం నెలకొంది. అలాగే ఎమ్మెల్యే కూడా 'నువ్వు అడిగావంటే..నేనేం వద్దంటానా' అంటూ మెడలో కండువాతో అందరి సమక్షంలో స్వాగతం పలికారు. దీంతో కాస్తంత నవ్వులు పూశాయి. అయితే అనంతరం ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు అందరికీ, కంగు తినిపించాయి. ఛైర్మన్‌తో తనకు సమస్యలు లేవుగానీ కౌన్సిలర్ల అవిశ్వాసం అనివార్యమన్నారు. దీంతో తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే మాట్లాడడంతో అక్కడున్న వారు విస్తుపోయారు. దీనిని ముందే ఛైర్మన్‌కు వివరించానని, ఎలా జరిగితే అలా జరుగుతుందన్నారు. అందులో ఆక్షేపణ లేదు గానీ, ముఖ్యమంత్రి అభివృద్ధి ప్రణాళికతోనే పార్టీలోకి చేరుతున్నట్లు ఛైర్మన్ ఎమ్మెల్యేకు చెప్పినట్లు అందరికి తెలిపారు. దీంతో అవిశ్వాసం ఎలా జరుగుతుందోనని ఒకింత ఉత్కంఠకు తెర లేపారు. అయితే ఎమ్మెల్యే మాట్లాడుతూ జంజనం ప్రస్థానం టీడీపీతోనేనని, అనేక మంది వైసీపీలో ఉన్న కౌన్సిలర్‌లు కూడా టీడీపీ తాను ముక్కలేనని ఎమ్మెల్యే మాట్లాడారు. వారు తప్పని పరిస్థితుల్లో మనుషులు అక్కడున్నా, మనసులు మాత్రం పార్టీతోనే ఉన్నట్లు వ్యాఖ్యానించారు. త్వరలోనే వారంత సొంత గూటికి చేరుతారని మాట్లాడడంతో అందరిలో ఉత్సాహం నిండింది.



ఛైర్మన్‌కు కండువ కప్పుతున్న ఎమ్మెల్యే

కళాకారుడు మద్దిలేటి మృతి



తోట చినమద్దిలేటి (ఫైల్)

అద్దంకి, మే1 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో ఉన్న రవీంద్రభారతీ ఎయిడెడ్ యుపీ స్కూల్ కరస్పాండెంట్, కళాకారుడు తోట చిన మద్దిలేటి(83) గురువారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలో 1969లో కాన్వెంట్ ఏర్పాటు చేసిన మద్దిలేటి అనంతరం రవీంద్రభారతీ ఎయిడెడ్ యూపీ స్కూల్‌గా మార్పు చేసి నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిలేటి గురువారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మద్దిలేటి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి,మే1 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని 7వ వార్డులో మొండితోకపాలెం నుంచి రామకృష్ణాపురం వరకు ప్రధాన మురుగు కాలువలో ఎస్కవేటర్‌తో పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ రవీంద్ర గురువారం పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతో పాటు, ఎరువు దిబ్బలు రోడ్ల పై ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

చినకొత్తపల్లి సర్పంచికి నోటీసు

అందుబాటులో లేకపోవడంతో ఇంటిగోడకు అతికించిన వైనం

అద్దంకి, మే1 (ఆంధ్రజ్యోతి): దుర్వినియోగానికి గురైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు చెల్లింపునకు సంబంధించి చినకొత్త పల్లి సర్పంచ్ గుజ్జుల మల్లికకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆమె వారం రోజులైన నోటీసును తీసుకోకుండా అందుబాటులో లేకపోవడంతో, గురువారం అధికారులు ఇంటి గోడకు అంటించారు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ లకు సంబంధించి మెటీరియల్ బిల్ రూ.15,74,823ను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించకుండా సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి సహకారంతో సొంతగా డ్రా చేసి వీరారెడ్డికి చెల్లించారు. ఈ విషయమై అప్పటి నుంచి పోరాటం చేస్తున్న మానం మురళీమోహన్ దాస్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు దఫాలుగా విచారించిన అధికారులు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ, బ్యాంక్ నుండి డ్రా చేసిన డబ్బులను వడ్డీతో సహా పంచాయతీ ఖాతా కు జమచేయాలని ఆదేశించారు. క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. అయితే ఆ నోటీసులు తీసుకునేందుకు సర్పంచ్ మల్లిక వారం రోజుల నుంచి కాలయాపన చేయడం, అందుబాటులో లేకపోవటం, రెండు రోజుల నుండి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిఉంటోంది. దీంతో గురువారం నోటీసును పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్‌వో జ్యోతిరావులు సర్పంచ్ మల్లిక ఇంటిగోడకు అంటించారు.



నోటీసు అంటిస్తున్న అధికారులు

చోరీ కేసులో సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన రూ. కోటికు పైగా బంగారు ఆభరణాలు, నగదు చోరీ ఘటన గురువారంతో సుఖాంతమైంది. అయితే ఈ విషయం గురువారం వెలువడిని సంచికలో 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ వివరాలను వెల్లడించారు. మునిసిపల్ పరిధిలోని నవాబ్‌పేటకు చెందిన షేక్ ఆజాద్, పఠాన్ మునీర్ చెరో రూ.8 లక్షలు వరకు అప్పులు చేశారు. ఈక్రమంలోనే ప్రతాప్ బీఈడీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మువ్వల ప్రసాదరావు ఇంట్లో గత మంగళవారం రాత్రి చోరీకు పాల్పడ్డారు. 125 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలు నగదు అపహరించారు. ఈక్రమంలో నమోదయిన కేసులో డిఎస్పీ ఎండి మొయిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీఐ సూరేపల్లి సుబ్బారావు నిందితులను పట్టుకున్నారు. అలాగే చోరీ జరిగిన పూర్తి సొత్తుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు సీఐ సుబ్బారావు, ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మీ, ఏఎస్సై నాగరాజు, సిబ్బంది శ్రీనివాసరావు, అచ్చయ్య, బాలచంద్ర, బ్రహ్మయ్య, రవూఫ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. వారికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందించినున్నట్లు పేర్కొన్నారు.

కోలలపూడి గ్రామ అభివృద్ధికి కృషి

ఎంపీ కృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు రంజన్

మార్టూరు, మే1 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధికి, గ్రామంలో ప్రజలకు కనీస అవసరాలైన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం ఎంపీ టి.కృష్ణప్రసాద్, పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్‌కే.రాజన్‌లు మండలంలోని కోలలపూడి గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి సర్పంచ్ ఎం. సతీష్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని అనూరాధ, గోపయ్య, శివ, నందిని, ప్రమీల, హనుమంతరావులకు ఎంపీ, ఛైర్మన్ల చేతుల మీదగా పెన్షన్లు పంపిణీ చేశారు. తరువాత గ్రామం నుంచి ద్రోణాదుల వైపు వెళ్లే నెరేడు కాలువ వద్ద దెబ్బ తిన్న వంతెనను ఎంపీ పరిశీలించారు. దాని మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఇంకా ఎస్సీ కాలనీలో శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీగోడను నిర్మించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరుచేయాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సర్పంచ్ ఎంపీకి అందజేశారు. వాటి మంజూరుకు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

పండ్ల తోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 1(ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని రైతులు వినియోగించుకోవాలని డ్వామా పీ.డీ. విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటలు పెంచే రైతులకు కల్పిస్తున్న సదుపాయాలపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రెండు వేల ఎకరాలలో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యాన్ని నిర్ణయించినట్లు పీ.డీ తెలిపారు. చినగంజాం మండలలానికి 120 ఎకరాలలో మొక్కలు పెంచాలని లక్ష్యాన్ని ఇవ్వగా ఇప్పటికి పది ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు తెలిపారు.

కూలీలకు వసతుల కరువు

- పనుల వద్ద నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు నిల్
- ఎండ వేడిమి, ఉక్కపోతతో కూలీల విల విల

బల్లికురవ. మే 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు ఉక్కపోత రోజురోజుకు పెరుగుతుండడంతో రోజు వారీ కూలీలు విలవిలలాడిపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లే కూలీలకు ప్రభుత్వం కనీస వసతులు కూడా కల్పించడం లేదని కూలీలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనుల వద్ద నీడ, నీరు అందుబాటులో ఉండేవని ఇప్పుడు ఎక్కడ అలాంటి వసతులు లేవని వారు అంటున్నారు. ఇలానే ఎండలు పెరిగితే పనులకు ముందు ముందు వచ్చే పరిస్థితి ఉండదని పలువురు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు కూలీలకు 13 వేల జాబుకార్డులను ప్రభుత్వం అందించింది. ఈ కార్డుల ద్వారా 24 వేల మంది కూలీలకు పనులు కల్పించాల్సి ఉంది. గ్రామాలలో వలస కూలీలకు ఇబ్బందులు లేకుండా పనులు అందుబాటులో ఉన్నాయి. కానీ పనుల వద్ద రోజు వారీ కూలీలకు సరైన వసతులు కల్పించడం లేదు. గతంలో పనులకు వచ్చే కూలీకి నీరు, ఎండ వేడిమి తట్టుకోనేందుకు నీడ నిచ్చే టెంట్లు, ఏదైన గాయాలు అయితే ప్రథమ చికిత్స కోసం కిట్లు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అలాంటి సౌకర్యాలు పనుల వద్ద లేవు. దీంతో కూలీలు పనులకు వెళ్లి వేసవి ఎండల తాకిడికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజు వారీగా పనులకు వెళ్లే కూలీలు కొంతసేపు పనులు చేసి ఎండ దెబ్బకు చెట్లుకు పరుగులు పెడుతున్నారు. అదే పనుల వద్దే నీడ ఇచ్చేలా టెంట్లు ఏర్పాటు చేస్తే కూలీలకు రోజు వారీ కూలీ పడుతుందని వారు అంటున్నారు. జాబు కార్డులు ఉన్న ఎలాంటి ఫలితం లేదని కొందరు కూలీలు అంటున్నారు. ఉపాధి పనులు అంటే భయమేస్తుందని వారు అంటున్నారు. కొండ ప్రాంతాలలో పనులు చేయిస్తున్నారని అక్కడ తాగు నీరు కూడా అందుబాటులో ఉండటం లేదని అందుకే పను లకు వెళ్లటం లేదని కొందరు కూలీలు అంటున్నారు. పంట కాలువలు పనులు చేసే సమయంలో ఉక్క పోత తో పనులు చేయలేక అక్కడే ఎండలో సేద తీరుతు న్నామని కూలీలు తెలిపారు. అధికారులు మాత్రం ఈ ఏడాది కూలీలకు ఎలాంటి సౌకార్యలు కల్పించేలా ఉత్తర్వులు రాలేదని అంటున్నారని కూలీలు తెలిపారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నాలుగు రోజుల క్రితం కూలీ మృతి

మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తూ, ఎండల దెబ్బకు రోజువారీ కూలీ తన్నీరు శ్రీనివాసరావు అస్వస్థతకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతు మృతి చెందా డు. ఉపాధి పనుల వద్ద కనీస వసతులు లేకపోవడం వలనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు కూలీలు అంటున్నారు.